సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 8 । నవంబర్ । 2024



సోమశిలలో 69.25 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 69.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి ఆరు వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.79,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,219
3 శాతం జీఎస్టీతో	రూ.7,436
నవర (8 గ్రా)	రూ.59,488

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.6 /26.0

గాలిలో తేమ 74 శాతంగా గురువారం నమోదైంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం శుక్రవారం పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఈ - కేవైసీని విధిగా చేయించుకోవాలి



మాట్లాడుతున్న కార్తీక్

నెల్లూరు(దర్గామిట్ట): గ్యాస్ కనెక్షన్ గల ప్రతి ఒక్కరూ ఈ - కేవైసీని తప్పక చేయించుకోవాలని జేసీ కార్తీక్ పేర్కొన్నారు. దీపం – 2 పథకంపై గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ – కేవైసీని చేయించుకోకపోతే దీపం – 2 పథకానికి అనర్హులవుతారనేది అపోహ మాత్రమేనని చెప్పారు. గతంలో దీపం – 1 పథకంలోని లబ్ధిదారులు, ఉజ్వల, జనరల్ కేటగిరీల వారు ప్రస్తుత పథకానికి అర్హులేనని, వీరి అర్హతల మేరకు ఉచిత సిలిండర్ సదుపాయాన్ని పొందవచ్చని తెలిపారు. జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు కలిగిన 8,41,784 మంది ఈ – కేవైసీని తప్పక చేయించుకోవాలని సూచించారు. ఆయా గ్యాస్ ఏజెన్సీ డెలివరీ బాయ్స్ వద్ద ఉన్న మొబైల్ ద్వారా చేయించుకోవచ్చని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు ఉచిత సిలిండర్‌ను 99,837 మంది బుక్ చేసుకోగా, 59,937 మందికి అందజేసి, సబ్సిడీ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. ఈ పథకంపై ప్రజల అనుమానాలను నివృత్తి చేసేందుకు వీలుగా 1967 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థికి అభినందన

నెల్లూరు (టౌన్): జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు నగరంలోని జీవీఆర్ఆర్ కళాశాల విద్యార్థి భార్గవి ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రవికుమార్ పేర్కొన్నారు. మినీబైపాస్‌లోని కళాశాలలో విద్యార్థినిని గురువారం అభినందించారు. అనంతరం జనహిత వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు చేతుల మీదుగా నగదు బహుమతిని అందజేశారు. ఎన్నెస్సెస్ పీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఎన్‌యూహెచ్ఎం విభాగంలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన.. డీఈఓ, ఎల్జీఎస్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టామని డీఎంహెచ్ఓ పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్, రిజర్వేషన్‌ను అనుసరించి పోస్టులను భర్తీ చేయనున్నామని వివరించారు. వివరాలకు spsnellore. ap. gov. in/ recruitmentను పరిశీలించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని అన్ని సర్టిఫికెట్లను జతపర్చి ఈ నెల 11 నుంచి 13వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.


వైద్యశాఖలో డిప్యుటేషన్లపై విచారణ



ఫైల్‌ను పరిశీలిస్తున్న కామేశ్వరప్రసాద్

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్లకు సంబంధించిన విచారణ పూర్తి స్థాయిలో జరుగుతోంది. ఆరోగ్య శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు జేడీ కామేశ్వరప్రసాద్ సంతపేటలోని వైద్యశాఖలో విచారణను గురువారం సైతం చేపట్టారు. డిప్యుటేషన్లకు సంబంధించి సింగపల్లి పేరుతో జయరాముడు ఫిర్యాదు చేసినా, విచారణకు హాజరుకాలేదు. నిబంధనలను ఉల్లంఘించి డిప్యుటేషన్లను ఎలా వేశారని అధికారి ప్రశ్నించారు. కాగా ముగ్గురు డాక్టర్లు మృతి చెందారని, ఆ స్థానంలో వైద్యసేవలు ఆగకుండా ఉండేందుకు సర్దుబాటు చేయాల్సి వచ్చిందని డీఎంహెచ్ఓ పెంచలయ్య తెలిపారు. కృష్ణాపురం పీహెచ్‌సీ డాక్టర్ విధులకు దుమ్మాకొట్టి ఉన్నత చదువులకు వెళ్తే ఉన్నతాధికారులకు ఎందుకు తెలియజేయలేదని.. మరో పీహెచ్‌సీలో మహిళా డాక్టర్ చెప్పకుండా విదేశాలకు వెళ్లొచ్చారని, ఇలాంటి వారి విషయంలో ఎందుకు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. డిప్యుటేషన్‌పై ఉన్న డాక్టర్లు ఉజ్వల చౌదరి, భాస్కర్, ప్రమోద్‌పై ఆరా తీశారు. పలువురు హెల్త్ అసిస్టెంట్లు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఎందుకున్నారని ప్రశ్నించారు. ఈ అంశాలపై జేడీని సంప్రదించగా, విచారణ జరుపుతున్నానని.. ఈ విషయమై ఏమీ మాట్లాడబోనని.. నివేదికను మెడికల్, హెల్త్ డైరెక్టర్‌కు అందజేస్తానని బదులిచ్చారు.

బలవంతపు చదువులు



నెల్లూరు ధనలక్ష్మీపురంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఒత్తిడి తట్టుకోలేక పాఠశాల హాస్టల్లోనే ఉరేసుకొని బలవన్మరణానికి బుధవారం పాల్పడ్డారు. పాఠశాల యాజమాన్యం నిర్వహించిన పరీక్షల్లో మార్కులు సక్రమంగా రాలేదనే మనస్తాపంతో ఈ దారుణానికి ఒడిగట్టారు. చదువులో సదరు విద్యార్థి సామర్థ్యాన్ని పాఠశాల యాజమాన్యం సైతం గుర్తించలేదు. ఫీజులు వసూలు చేసి బలవంతపు విద్యను రుద్దారు.

నగరంలోని నారాయణ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థి ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డారు. పదో తరగతి చదువుతూ విద్యలో ఎప్పుడూ ముందుండేవారు. అయితే విద్యార్థిని స్టేజిపై నిలబెట్టి సహచరుల ముందే ఉపాధ్యాయుడు అవమానించడంతో మనస్తాపానికి గురై ఇస్కాన్ సిటీలోని తన నివాసంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ తరహాలో చదువులో ఒత్తిడ్ని తట్టుకోలేక ఎంతో మంది ప్రాణాలు తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది.

తమ పిల్లలను ఉన్నత స్థానంలో చూడాలనేది తల్లిదండ్రుల ఆశ. అయితే వీరు ఏ రంగంపై ఇష్టంగా ఉన్నారోననే అంశాన్ని తెలుసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా తమ అభిప్రాయాన్నే పిల్లలపై బలవంతంగా రుద్దుతున్నారు. ఈ తరుణంలో దీన్నే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు చక్కగా క్యాష్ చేసుకుంటున్నాయి. ప్రాథమిక దశ నుంచే ఐఐటీ, నీట్, ఐఏఎస్, ఐపీఎస్ ఫౌండేషన్ పేర్లతో ఎక్కడా లేని సిలబస్‌లను తీసుకొచ్చి పిల్లలపై భారం మోపుతున్నారు. ఏడాదికో కొత్త పేరును తెరపైకి తెచ్చి కోర్సుల పేరిట అధిక మొత్తంలో ఫీజులను గుంజుతున్నారు. ఎల్కేజీ నుంచే రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తుండటం విస్మయానికి గురిచేస్తోంది. తల్లిదండ్రులు సైతం ఏమీ ఆలోచించకుండానే యాజమాన్యాలు అడిగినంత సమర్పిస్తున్నారు.

- పిల్లల ఇష్టాలను పట్టించుకోని తల్లిదండ్రులు
- అవకాశాన్ని క్యాష్ చేసుకుంటున్న విద్యాసంస్థల యాజమాన్యాలు
- ఏటా తెరపైకి కొత్త కోర్సులు
- ఐఐటీ, నీట్‌కు బోధన అంటూ బుకాయింపు
- ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థుల బలవన్మరణాలు
- అనుమతుల్లేకుండానే హాస్టళ్ల నిర్వహణ

నెల్లూరు (టౌన్): మార్కులు, ర్యాంకులు పేరిట ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ప్రాథమిక దశ నుంచే ఇంటర్ పుస్తకాలను విక్రయించి వారిపై ఆ సిలబస్‌ను బలవంతంగా రుద్దుతున్నారు. పిల్లల ఆసక్తితో సంబంధం లేకుండా మార్కులు, ర్యాంకులే పరమావధిగా వ్యవహరిస్తున్నారు. రోజూ 12 నుంచి 13 గంటల పాటు పుస్తకాలతో కుస్తీ పట్టేలా చేస్తూ వారిని బాహ్య ప్రపంచానికి దూరం చేస్తున్నారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక.. ఇంట్లో చెప్తే తల్లిదండ్రులు ఏమంటారోననే భయంతో కొందరు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. మరికొందరు తక్కువ మార్కులొచ్చాయనే ఆందోళనతో అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. అయితే ఇవేవీ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు పట్టడంలేదు.

హాస్టళ్ల నిర్వహణ.. అంతా అయోమయం

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి 50కుపైగా హాస్టళ్లున్నాయి. వీటిలో ఎన్నింటికి అనుమతులున్నాయో స్పష్టత లేదు. వీటి నిర్వహణకు అనుమతిని ఎవరు జారీ చేస్తున్నారనే అంశంలోనూ అయోమయమే. మరోవైపు వీటికి అనుమతులు, నిర్వహణలో తమకెలాంటి సంబంధంలేదని జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వాస్తవానికి పాఠశాలల ప్రాంగణంలో హాస్టళ్లను నిర్వహించకూడదు. అయితే ఈ నిబంధన ఎక్కడా అమలు కావడంలేదు. నాసిరక భోజనాన్ని అందిస్తున్నారు. పోనీ సరైన వసతులున్నాయానంటే అదీ మృగ్యమే. గాలి, వెలుతురు లేని ఇరుకు గదుల్లో ఆరేడుగురు విద్యార్థులను ఉంచుతున్నారని తెలుస్తోంది. భోజన నాణ్యతపై తనిఖీలు చేసే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పాఠశాలలకు సంబంధించిన హాస్టళ్లపై తనిఖీలు నిర్వహించి.. నిబంధనలను అతిక్రమించిన యాజమాన్యాలపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పిల్లల అభిప్రాయాలను తెలుసుకోవాలి



పిల్లలు ఏ రంగంపై ఇష్టంగా ఉన్నారో తల్లిదండ్రులు తెలుసుకోవాలి. అయితే తమ అభిప్రాయాలను పిల్లలపై బలవంతంగా రుద్దుతున్నారు. ఒత్తిడి, ఆందోళనతో లక్ష్యం నెరవేరకపోవడంతో విద్యార్థుల్లో ఆత్మహత్య భావన పెరుగుతోంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సైతం పిల్లల ఐక్యూను పరిగణనలోకి తీసుకోకుండా వారిపై చదువును బలవంతంగా రుద్దుతున్నారు. పిల్లల ఆత్మహత్యలకు ఇదీ ఓ కారణం. మార్కులు, ర్యాంకులతో సంబంధం లేకుండా పిల్లల తెలివితేటల ఆధారంగా బోధించాలి. – సురేష్, సైకాలజిస్ట్, బిహేవియర్ థెరపిస్ట్

హాస్టళ్లను పరిశీలించి చర్యలు చేపడతాం



పాఠశాలల ప్రాంగణంలో హాస్టళ్ల నిర్వహణపై పరిశీలించి చర్యలు చేపడతాం. హాస్టళ్లకు విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు జారీ చేయలేదు. జిల్లాలో ఎన్ని ఉన్నాయనే అంశమై పూర్తి వివరాలు తెలుసుకుంటా. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై చర్యలు చేపడతాం. – బాలాజీరావు, డీఈఓ

నాసిరకంగా కాలువ పూడికతీత

మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన కిలివేటి సంజీవయ్య, సత్యనారాయణరెడ్డి తదితరులు



- రూ.ఆరు కోట్ల దోపిడీకి సోమిరెడ్డి స్కెచ్
- ఇరిగేషన్ అధికారులు తప్పించుకోలేరు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: రైతుల పేరు చెప్పి కనుపూరు కాలువ పూడికతీత పనులను సోమిరెడ్డి, ఆయన కుమారుడు అత్యంత నాసిరకంగా చేపడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని కనుపూరు కాలువ పూడికతీత పనులను సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డితో కలిసి కాకాణి గురువారం పరిశీలించారు. అనంతరం విరువూరులో విలేకరుల సమావేశంలో కాకాణి మాట్లాడారు. పూడికతీత పనుల్లో రూ.ఆరు కోట్లను దోపిడీ చేసేందుకు సోమిరెడ్డి, ఆయన తనయుడు స్కెచ్ వేశారని ఆరోపించారు. కనీసం రూ.60 లక్షల పనులైనా చేసి ఉంటారని పరిశీలించేందుకు వస్తే, రూ.30 లక్షల పనులు సైతం జరిగిన దాఖలాల్లేవని విమర్శించారు. తూముల కింద పూడికను తొలగించకుండా మెషీన్లను ఏర్పాటు చేసి తూతూమంత్రంగా పనులు చేశారని చెప్పారు. సంగం ఆనకట్ట నుంచి కనుపూరు కాలువకు నీటిని అధికారులతో కలిసి సోమిరెడ్డి హడావుడిగా విడుదల చేశారని, పనుల నాణ్యతపై మభ్యపెట్టేందుకే ఇలా వ్యవహరించారని ధ్వజమెత్తారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కాలువ పూడికతీత, రిపేర్ల పేరుతో రూ.26 కోట్లను స్వాహా చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. అవినీతికి ఇరిగేషన్ శాఖ అధికారులు వంతపడుతున్నారని, భారీ మూల్యాన్ని వారు చెల్లించుకోకతప్పదన్నారు. ప్రభుత్వ నిధులను దోపిడీ చేసేందుకు సహకరిస్తున్న వారు జైలుకెళ్లి ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇరిగేషన్ అధికారుల విషయంలో గతంలో ఉదాసీనంగా వ్యవహరించామని, ఇప్పుడు ఆధారాలతో సహా బహిర్గతం చేస్తామని స్పష్టం చేశారు. తాము అధికారంలో ఉన్న సమయంలో సోమిరెడ్డి మాదిరిగా ప్రవర్తించి ఉంటే అల్లీపురం నుంచి బయటకు కూడా రాలేకపోయేవారని తెలిపారు. తమ పార్టీ సత్తా చూపుతామని, కేసులకు భయపడే రకం కాదని తేల్చిచెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా వెనుకాడే ప్రసక్తే లేదని, అవినీతిపై పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

దారుణంగా పూడికతీత పనులు


కనుపూరు కాలువ పూడికతీత పనులను దారుణంగా చేపట్టారని, ఎక్కడా పూర్తిగా తొలగించిన దాఖలాల్లేవని కిలివేటి సంజీవయ్య, సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమిరెడ్డివి ఉడత బెదిరింపులని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే ఊరుకునేదిలేదన్నారు. కాకాణి నాయకత్వంలో.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్షాన అవినీతిపై పోరాటం చేస్తామని చెప్పారు. సాగునీటి అవసరాల కోసం పూడికతీత పనులను చేపట్టేందుకు ఈ నెల 11న టెండర్ల ప్రక్రియ ముగియనున్నా, ముందుగానే పనులను చేపట్టడంలో గల ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పనులను ఇలా సైతం చేయొచ్చాననే సందేహం కలుగుతోందని పేర్కొన్నారు. విరువూరు మాజీ సర్పంచ్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

శివారెడ్డికి ఆగని పోలీసుల వేధింపులు



ఉదయగిరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వింజమూరు మండల సోషల్ మీడియా కన్వీనర్ పెసల శివారెడ్డిపై పోలీసుల వేధింపుల పరంపర కొనసాగుతోంది. వింజమూరులోని తన ఫొటో స్టూడియోలో శివారెడ్డిని నాలుగు రోజుల క్రితం పోలీసులు సినీఫక్కీలో అరెస్ట్ చేసి కళ్లకు గంతలు కట్టి అర్ధరాత్రి వరకు వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ విచారణ చేశారు. అదే రోజు అర్ధరాత్రి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. మరుసటి రోజు ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ అనంతరం నెల్లూరు ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడ సాయంత్రం వరకు ఉంచి అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని ఇంటికి పంపించారు. తాజాగా గురువారం మరోసారి ఉదయగిరి పోలీసులు స్టేషన్‌కు పిలిపించి కొంతసేపు విచారణ చేశారు. అనంతరం తాడేపల్లి డీజీపీ కార్యాలయానికి వెళ్లాలని చెప్పి కారులో కొంతదూరం తీసుకెళ్లారు. ఏమైందో తెలియదు గానీ తాడేపల్లికి వెళ్లకుండా ఉదయగిరి స్టేషన్‌కు తీసుకొచ్చారు. పార్టీ నేతలు మాట్లాడిన అనంతరం ఇంటికి పంపారు. పోలీసుల చర్యలతో ఆయన కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పోలీసులు ఏమి చేస్తారోననే భయంతో హడలిపోతున్నారు. తెల్లారితే ఏమి జరుగుతుందోననే ఆందోళన వారిలో కనిపిస్తోంది.

నిండుకుండలా సోమశిల



- 5.51 లక్షల ఎకరాలకు సాగునీటి విడుదలకు సన్నాహాలు

నెల్లూరు(దర్గామిట్ట): సోమశిల జలాశయం నిండుకుండలా మారింది. పూర్తి సామర్థ్యం 78 టీఎంసీలను చేరుకునే అవకాశం కనిపిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహంతో నీటిని విడుదల చేసేందుకు అవకాశం ఏర్పడింది. కండలేరు జలాశయానికి పది వేలు.. ఉత్తర కాలువకు 700.. దక్షిణ కాలువకు 300, నారుమళ్ల కోసం పెన్నార్ డెల్టాకు 2150 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

మొదటి పంటకు ఢోకా లేనట్లే..

జలాశయానికి మరో 11 టీఎంసీల నీరొచ్చే అవకాశముందని భావిస్తున్నారు. ప్రస్తుత లెక్కల మేరకు సోమశిల నుంచి 5.51 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే యోచనలో అధికారులు ఉన్నారని సమాచారం. జలాశయం నుంచి 55.1 టీఎంసీల నీరు అవసరమయ్యేలా అధికారులు అంచనాలు వేస్తున్నారు.

ఐఏబీ సమావేశం నేడు

కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఐఏబీ సమావేశాన్ని కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 3.30 నుంచి నిర్వహించనున్నామని ఇరిగేషన్ ఎస్‌ఈ దేశ్‌నాయక్ తెలిపారు. 2024 – 25 ఖరీఫ్ సాగుకు గానూ సోమశిల, కండలేరు జలాశయాల నుంచి సాగునీటి విడుదల తదితర విషయాలపై సమావేశంలో చర్చించనున్నామని వివరించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

మాతాశిశు మరణాలను తగ్గించాలి



మాట్లాడుతున్న వాణి

నెల్లూరు(పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో మాతాశిశు మరణాలను తగ్గించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని పేర్కొన్నారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. తల్లీబిడ్డ సురక్షితంగా ఉండేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సరైన అవగాహన లేని కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఏటా నవంబర్ 7న శిశురక్షా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని వివరించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలు, నిరక్షరాస్యులు, దివ్యాంగులకు ఉచిత న్యాయసాయాన్ని అందించనున్నామని పేర్కొన్నారు. న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి, సూపర్‌వైజర్లు స్వరూప, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో సత్తా



పతకాలను అందుకుంటున్న మణికంఠ

సీతారామపురం: నర్సరావుపేటలో నిర్వహించిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో సీతారామపురానికి చెందిన పాపనబోయిన మణికంఠ సత్తాచాటారు. 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ అండర్ – 17 విభాగంలో రజత పతకం.. వంద.. 200 మీటర్ల విభాగంలో తృతీయ స్థానాల్లో నిలిచి మొత్తం మూడు పతకాలను సాధించారు

విచారణ జరిపి నివేదికను అందజేయండి

- కలెక్టర్‌కు ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో వంట చేయించిన విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదికను వారంలో అందజేయాలని కలెక్టర్‌ను జాతీయ బాలల హక్కుల కమిషన్ ఆదేశించిందని సమాచారం. విద్యార్థినులతో చపాతీలను తయారు చేయించిన అంశమై 'విద్యార్థులే వంట మాస్టర్లు' అనే శీర్షికన సాక్షిలో సెప్టెంబర్‌లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై నెల్లూరుకు చెందిన సింహపురి చైతన్య వేదిక నిర్వాహకుడు మనోజ్‌కుమార్ జాతీయ బాలల హక్కుల కమిషన్‌కు అప్పట్లోనే ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కమిషన్ ఈ వ్యవహారంపై నివేదికను అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించింది.

స్క్రీనింగ్‌తో కేన్సర్‌ను దూరం చేయొచ్చు



ర్యాలీని ప్రారంభిస్తున్న పెంచలయ్య తదితరులు

నెల్లూరు(అర్బన్): ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలతో కేన్సర్‌ను దూరం చేయొచ్చని డీఎంహెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సింగ్ విద్యార్థినులు, డాక్టర్లతో కలిసి భారీ ర్యాలీని జిల్లా వైద్య శాఖ, పీహెచ్‌పీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద ర్యాలీని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ సుధీర్‌కుమార్, డీఎంహెచ్ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడారు. 30 ఏళ్లు దాటిన వారు ఏడాదికోసారైనా అల్ట్రాసౌండ్ స్కానింగ్, రక్త పరీక్షను చేయించుకోవాలని కోరారు. కేన్సర్ నివారణలో భాగంగా ఇంటి వద్దే స్క్రీనింగ్ పరీక్షలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డీపీఎంఓ రమేష్, డెమో అధికారి కనకరత్నం, వైద్యాధికారులు ప్రమోద్, నవీన్, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

- కలెక్టర్ ఆనంద్



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఆనంద్

వింజమూరు (ఉదయగిరి): జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పనుల ద్వారా రూ.80 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపట్టామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఉదయగిరి, వింజమూరు, కలిగిరి, జలదంకి మండలాల్లో గురువారం పర్యటించిన ఆయన ఉపాధి హామీ పనులు జరుగుతున్న తీరు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం వింజమూరు మండలం నందిగుంటలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సిమెంట్ రోడ్లు, మినీ గోకులాల పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వివరించారు. జిల్లాకు 1300 మినీ గోకులాలను మంజూరు చేయగా, ఇప్పటికే వంద మేర పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలోని 500 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాన్ని కల్పించేందుకు నిధులను మంజూరు చేసి.. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌డబ్ల్యూఎస్, పట్టణాల్లో పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ల ద్వారా పనులను చేపట్టామని వెల్లడించారు. నెల్లో వీటిని పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

ఉపాధిపై ప్రత్యేక దృష్టి

జాతీయ ఉపాధి హామీ పథకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని, దీని ద్వారా జిల్లాలో ఇప్పటికే 2800కుపైగా పనుల మంజూరుకు ఉత్తర్వులను జారీ చేశామని చెప్పారు. మరికొన్ని పనులకు ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వినతులొచ్చాయని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీటిని సైతం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మెట్ట ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కూలీల సంఖ్య ఎంత పెరిగితే ఆ మేరకు మెటీరియల్ కాంపొనెంట్ నిధులు మంజూరవుతాయన్నారు. నందిగుంటలో సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, డ్వామా పీడీ గంగాభవానీ, పంచాయతీరాజ్ ఎస్‌ఈ అశోక్‌కుమార్, వింజమూరు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ సయ్యద్ హమీద్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల మెడపై కత్తి

ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం కత్తి వేలాడదీసింది. రోజుకో నిబంధనతో ఇబ్బందులు పెడుతోంది. ఈసారి వైద్యశాఖలోని వారిని టార్గెట్ చేసింది. హాజరు పేరుతో వేతనాల్లో కోతలు మొదలయ్యాయి. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేసే డాక్టర్లు, నర్సులు, సిబ్బంది అక్టోబర్ జీతాలను కట్ చేసింది. ఎఫ్ఆర్ఎస్‌లో (ముఖ హాజరు) ఏ మాత్రం జాప్యం జరిగినా ప్రతినెలా కోతలుంటాయని హెచ్చరించడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.



దేవరపాళెంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్, సిబ్బంది (ఫైల్)

- ■ వైద్యశాఖలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా అధికారిగా (డీపీఓ) ఒక డాక్టర్ పని చేస్తున్నారు. ఆయన నెల జీతం రూ.60 వేలు. ఎఫ్ఆర్ఎస్ హాజరు సకాలంలో వేయలేదంటూ అక్టోబర్ నెలకు సంబంధించి రూ.24 వేలను కోత విధించింది కూటమి ప్రభుత్వం.
- ■ సీతారామపురం మండలంలో పని చేస్తున్న ఓ నర్సు రెగ్యులర్‌గా విధులకు హాజరవుతుంటారు. సిగ్నల్స్ సక్రమంగా అందకపోవడంతో ఎఫ్ఆర్ఎస్ సక్రమంగా వేయలేకపోయారు. ఆమెకు అక్టోబర్ నెల జీతం మొత్తం ఆపేశారు. ఇలా మొత్తం ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్, డాక్టర్లకు ఒకరోజు నుంచి 12 రోజుల వరకు వేతనాలు కట్ చేయడం జరిగింది.



జిల్లాలో 975 మందికి జీతాల్లో కోత

- ఆరుగురికి సున్నా వేతనం
- నిమిషం ఆలస్యమైనా కనికరం లేదు
- సిగ్నల్ లేక ఎఫ్ఆర్ఎస్ వేయలేకపోయినా అంతే
- లబోదిబోమంటున్న ఎన్‌హెచ్‌ఎం నర్సులు, డాక్టర్లు, సిబ్బంది

నెల్లూరు(అర్బన్): జిల్లాలో రోగులకు వైద్యసేవలందించడంలో ఎన్‌హెచ్‌ఎం డాక్టర్లు, నర్సులు ముందంజలో ఉన్నారు. ఏదో ఒకరోజు ప్రభుత్వం తమను గుర్తించకపోతుందా.. జీవితాలు మారకపోతాయా అనే ఆశతోనే వారంతా పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైద్యశాఖ ఉద్యోగులను వేధించడమే పనిగా పెట్టుకుంది. ఇప్పటికే 108, 104 ఉద్యోగులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదు. ఆరోగ్యశ్రీ ఉద్యోగులదీ అదే పరిస్థితి. తాజాగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జీతాల్లో కోతపెట్టి వేధిస్తోంది.

ఇంతమందికి..

జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ కింద ఎంఎస్సీ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్ లాంటి ఉన్నత విద్యనభ్యసించిన 490 మంది మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీలు), 45 మంది డాక్టర్లు, 130 మంది రెండో ఏఎన్‌ఎంలున్నారు. మిగతా వారు ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఆఫీస్ కార్యాలయ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. వీరంతా కలిపి 975 మంది వైద్యశాఖ పరిధిలో ఉన్నారు. వీరందరికీ ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా వేతనాల్లో కోత వేశారు. ఆరుగురు నర్సులకు అసలు జీతమే రాలేదు.

రోజూ మూడుసార్లు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జీతాలకు ఎఫ్ఆర్ఎస్‌తో (ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టం) లింక్ పెట్టారు. వీరు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వర్తించాలి. ఉదయం 9 గంటలకు ఒకదఫా, మధ్యాహ్నం రెండు గంటల్లోపు ఒకసారి, సాయంత్రం విధులు ముగించుకుని వెళ్లేముందు నాలుగు గంటలకు మరోసారి ఎఫ్ఆర్ఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో హాజరు వేయాలి. హాజరు పట్టీలో సకాలంలో సంతకం చేసినా మళ్లీ ఎఫ్ఆర్ఎస్ వేయాల్సిందే.

సిగ్నల్ లేక సమస్యలు

ఎక్కువమంది నర్సులు, సిబ్బంది పల్లెల్లో పీహెచ్‌సీల్లో, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు (హెల్త్ అండ్ వెల్నెస్)లో పనిచేస్తున్నారు. ఇక్కడ ఇంటర్నెట్ సక్రమంగా రాదు. పలుమార్లు సిగ్నల్స్ ఉండవు. అలాంటి సమయంలో కూడా ఆన్‌లైన్‌లో హాజరు నమోదు వేయాలి. ఆలస్యమైతే అంతే సంగతి. ఒక్కోదఫా ఎఫ్ఆర్ఎస్ సకాలంలో వేసినా అది బ్లూ కలర్‌లో పడుతుంది. దీనిని సిస్టం తీసుకోదు. గ్రీన్ పడి మెసేజ్ వస్తేనే సిస్టం అంగీకరిస్తోంది. కొంతమంది ప్రయాణంలో ట్రాఫిక్‌లో ఇరుక్కొని పది నుంచి 15 నిమిషాలు ఆలస్యంగా హాజరు ఎఫ్ఆర్ఎస్ వేసినా జీతాలకు కోతపెట్టింది కూటమి ప్రభుత్వం. సిగ్నల్స్, ఆన్‌లైన్ సమస్యలు సరిచేయకుండా కనీసం ఒక్కమాట కూడా చెప్పకుండా అక్టోబర్ నెలలో జీతాలు కోత విధించడంపై ఉద్యోగులు మండి పడుతున్నారు.

జిల్లాలో..

పీహెచ్‌సీలు	58
అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	28
సామాజిక ఆరోగ్య కేంద్రాలు	10
ఏరియా ఆస్పత్రులు	2
జిల్లా ఆస్పత్రి	1
నెల్లూరులో సర్వజన ఆస్పత్రి	1

మా ప్రమేయం ఉండదు

జీతాలు ఆపడంలో మా ప్రమేయం ఉండదు. ఎఫ్ఆర్ఎస్ హాజరును బట్టి వైద్యశాఖ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం మేరకు ఎన్‌హెచ్‌ఎం సిబ్బందికి జీతాల్లో కోత విధించారు.

– పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

ఇది అన్యాయం



ఎన్‌హెచ్‌ఎం డాక్టర్లు, నర్సులు, టెక్నికల్ సిబ్బంది వేతనాలు చాలా తక్కువ. అయినా వారు కష్టపడి పని చేస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్ సక్రమంగా వేయకపోవడానికి అనేక లోపాలున్నాయి. సిగ్నల్ వ్యవస్థను సరిచేయాలి. నెట్‌వర్క్ పూర్తిగా ఉండాలి. లోపాలు సరిచేయకుండా వేతనాలు కట్ చేయడం అన్యాయం. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని కోత విధించిన వేతనాలు తక్షణమే వేయాలి. లేకుంటే ఆందోళనలు చేస్తాం.

– ఎస్.సతీషకుమార్, ఏపీ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు

జీతంలోనూ పక్షపాతమే..

ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేసే సిబ్బందికి రెగ్యులర్, కాంట్రాక్ట్ వారితో సమానంగా జీతాలివ్వడం లేదు. ఎంఎస్సీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు చేసి కూడా కేవలం రూ.25 వేలకే ఎంఎల్‌హెచ్‌పీలు పని చేస్తున్నారు. రెండో ఏఎన్‌ఎంలు రూ.22 వేలు పొందుతున్నారు. ఇక డాక్టర్ల జీతం రూ.60 వేలు. స్పెషలిస్టులు మాత్రం రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎఫ్ఆర్ఎస్ పేరుతో వీరందరి జీతాల్లో కోతలు పడ్డాయి. అయితే రెగ్యులర్ నర్సులు, డాక్టర్లు ఆలస్యంగా వచ్చినా వారి జీతాల్లో కోతవేయలేదు.

క్లుప్తంగా

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రులకు సాయం చేస్తున్న గ్రామస్తులు

మర్రిపాడు: మండలంలోని అచ్చమాంబ గుడి సమీపంలో జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పొంగూరు గ్రామానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చి తిరిగి కారులో బయలుదేరాడు. వాహనంలోకి ఈగ వచ్చింది. దానిని అతను బయటకు పంపేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ఇద్దరికి తీవ్రగాయాలు, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఓ మహిళ కాలు పూర్తిగా దెబ్బతింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రైవేట్ వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

20 సవర్ల బంగారం చోరీ

వలేటివారిపాలెం: పట్టపగలే దొంగలు పడి 20 సవర్ల బంగారం, రూ.40 వేల నగదును చోరీ చేసిన ఘటన మండలంలోని అయ్యవారిపల్లిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎం.ప్రభాకర్ గొర్రెలు మేపుతుంటాడు. అతని భార్య వరమ్మ గ్రామంలోని పొలం పనులకు వెళ్తుంటుంది. రోజులాగే గురువారం వరమ్మ పనికి వెళ్లింది. ప్రభాకర్ గొర్రెలను పొలాల్లోకి వెళ్లాడు. కాసేపటికి ఇంట్లో సిలిండర్ పెట్టేందుకు ప్రభాకర్ వెళ్లాడు. ఆ సమయంలో ఇంటి ముందు ఓ యువకుడు మోటార్‌బైక్‌పై ఉండటంతో ఎవరని ప్రశ్నించగా.. పెట్రోల్ అయిపోయిందని సమాధానమిచ్చాడు. ఇంతలో ఇంట్లో నుంచి మరో యువకుడు హడావుడిగా బయటకు రాగా ఇద్దరూ కలిసి వెళ్లిపోయారు. ప్రభాకర్ లోపలికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. దీంతో కేకలు వేస్తూ బయటకు రాగా అప్పటికే యువకులు పరారయ్యారు. బీరువాలో ఉన్న 20 సవర్ల బంగారం, రూ.40 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై మహేంద్రనాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	రూ.50
సన్నవి	రూ.35
పండ్లు	రూ.20



ఆగని గ్రావెల్ మాఫియా ఆగడాలు

- చెరువుల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు



ట్రాక్టర్‌లో గ్రావెల్‌ను లోడ్ చేస్తున్న జేసీబీ

వెంకటాచలం: మండలంలో గ్రావెల్ మాఫియా ఆగడాలు మితిమీరిపోయాయి. ప్రభుత్వ భూములను, చెరువులను వదలకుండా రేయింబవళ్లు తవ్వకాలు చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. తాజాగా మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ పరిధి మామిడిగుంట చెరువులో, సర్వేపల్లి పంచాయతీ కొర్లపాడు సంఘం వద్దనున్న చెరువుల్లో తవ్వకాలు చేసి వందల ట్రాక్టర్లలో నిత్యం అక్రమ రవాణా చేస్తున్నారు. ఇంటి అవసరాలకని చెబుతూ ఒక ట్రాక్టర్ గ్రావెల్‌ను రూ.1,000 నుంచి రూ.2,000 లెక్కన అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. సామాన్యుడు ఒక ట్రిప్పు మట్టిని ఇంటికి తీసుకెళ్లాలంటే రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ అధికారులు ఎన్నో అడ్డంకులు సృష్టిస్తున్నారు. అయితే టీడీపీ నేతలు అక్రమ రవాణా చేస్తుంటే పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. తవ్వకాలపై ఇడిమేపల్లి, సర్వేపల్లి రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. జిల్లా అధికారులు స్పందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోండి

- కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: పట్టణంలో ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్‌ను కలిశారు. రామిరెడ్డి మాట్లాడుతూ కావలి పట్టణంలో 128 ఎకరాలు కబ్జాకు గురైనట్లు ఎవరు చెప్పమంటే చెప్పారు?, అదే నిజమైతే ఆ భూముల వద్ద బోర్డులు పెట్టి వాటి చుట్టూ కంచె ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. 128 ఎకరాలకు సంబంధించిన సర్వే నంబర్లు, మ్యాప్‌లు ఇవ్వాలని కోరారు. ప్రెస్‌మీట్ పెట్టి భూములు కబ్జా చేసినట్లు చెప్పారు కాబట్టే వివరాలు అడుగుతున్నానని చెప్పారు. నిజంగా ఆక్రమించి ఉంటే స్వాధీనం చేసుకోవాలని, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులను, ఫ్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలను ఇబ్బందులు పెట్టడం దుర్మార్గమన్నారు. పట్టణంలో బుడంగుంట రోడ్డు, మందాటి చెరువు కట్ట, ముసునూరు అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి, వాటికి దొంగ పట్టాలు సృష్టించి దర్జాగా నిర్మాణాలు చేస్తుంటే ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. రామిరెడ్డి అడిగిన అంశాలపై కమిషనర్ నిర్దిష్టమైన సమాధానాలు చెప్పకుండా దాటవేసే ధోరణిలో మాట్లాడారు.

టీడీపీలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

- పలువురికి గాయాలు
- పోలీసులకు పరస్పర ఫిర్యాదు



గాయపడిన ముజీర్ వర్గం వ్యక్తి సర్దార్



గాయపడిన జహీర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): టీడీపీలోని రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డి కాలనీలోని రైలువీధి ప్రాంతంలో సిమెంట్ రోడ్డు నిర్మాణం నిమిత్తం టీడీపీకి చెందిన జహీర్, అతని వర్గం వారు గురువారం మధ్యాహ్నం కొలతలు తీస్తున్నారు. ఇదే సమయంలో మరో వర్గానికి చెందిన ముజీర్, అతని అనుచరులు అక్కడికి చేరుకున్నారు. తాను కార్పొరేటర్ భర్తనని, మేము చేయాల్సిన పనులు మీరెందుకు చేస్తున్నారని ముజీర్ జహీర్ వర్గంతో వాగ్వాదానికి దిగాడు. వీరి మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడి ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. జహీర్ తలపై తీవ్ర గాయమైంది. అతని అన్న కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యుడు జమీర్‌తోపాటు, ముజీర్ వర్గానికి చెందిన వారికి గాయాలయ్యాయి. జహీర్, జమీర్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణకు అత్యంత సన్నిహితుడైన జహీర్‌పై అదే పార్టీకి చెందిన వారు దాడి చేయడం చర్చనీయాంశమైంది. జహీర్‌ను టీడీపీ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్ అజీజ్‌లు పరామర్శించారు. వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న జహీర్‌పై ఇటీవల టీడీపీలో చేరిన వారు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇరువర్గాలు నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశాయి.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన నెల్లూరు నగరంలో గురువారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. రంగనాయకులపేట సమీపంలో పట్టాలపై 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి చనిపోయి ఉండటాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు ఆరెంజ్ కలర్ బనియన్, బ్లూ కలర్ షార్ట్ ధరించి ఉన్నాడు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విడవలూరు: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఊటుకూరు గ్రామంలో ఇరవరాజు శేఖర్ (35) అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. మనస్తాపంతో ఇప్పటికే శేఖర్ రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. నాలుగు రోజుల క్రితం అతను ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని బయటకు రాలేదు. గురువారం దుర్వాసన రావడంతో పక్కింటి వారు గమనించి శేఖర్ బంధువులకు సమాచారం అందించారు. వారు తలుపులు పగులగొట్టి చూడగా శేఖర్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్నాడు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలియజేశారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

నెల్లూరు(లీగల్): ఓ వ్యక్తిని హత్య చేశాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాళెం గ్రామం గొల్లవీధి ప్రాంతానికి చెందిన చేవూరు సుధీర్‌కు శిక్ష ఖరారైంది. జీవితఖైదుతోపాటు రూ.1,000 జరిమానా విధిస్తూ మూడో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎల్.తేజోవతి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ముదివర్తిపాళేనికి చెందిన సుగుణమ్మ 2021 సంవత్సరం జూలై 29వ తేదీన సాయంత్రం తన పశువుల్ని తోలుకెళ్తున్నారు. అదే గ్రామానికి చెందిన చిట్టిబోయిన మహేంద్ర ఆమె వద్దకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. అక్కడే ఉన్న సుధీర్ కల్పించుకుని మహేంద్రతో గొడవకు దిగాడు. మహేంద్ర ఇంటికెళ్లి తన తండ్రితో వివాదం గురించి చెప్పాడు. రాత్రి 7 గంటల ప్రాంతంలో అతను తన ఇంటి బయట నిలబడి ఉండగా సుధీర్ వెళ్లి గొడవకు దిగి తన వెంట తెచ్చిన కత్తితో పొడిచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన మహేంద్రను అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇందుకూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం సుధీర్‌పై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో పైమేరకు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కాకుటూరు రమేష్‌రెడ్డి కేసు వాదించారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

నెల్లూరు సిటీ: జిల్లాలో బెల్టుషాపులు నిర్వహించినా, ఎమ్మార్పీని ఉల్లంఘించి అధిక ధరలకు మద్యం విక్రయాలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మద్యం షాపులు, నిబంధనల మేరకు వ్యాపారం చేసుకోవాలన్నారు. నూతన మద్యం పాలసీ అమలు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు 62 బెల్టు షాపులపై కేసులు నమోదు చేసి, 62 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. బెల్టు షాపుల నిర్వహణ, సారా తయారీ, విక్రయాలపై తమకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనధికార మద్యం విక్రయాలపై కూడా ముమ్మరంగా దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలియజేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	130
లేయర్ (లైవ్)	110
బ్రాయిలర్ చికెన్	236
బ్రాయిలర్ స్కిన్‌లెస్	262
లేయర్ చికెన్	187



అడిగేదెవరు.. అడ్డుకునేదెవరు..?

- నగరంలో విచ్చలవిడిగా అనధికార ఫ్లెక్సీలు
- మంత్రి మాటలు నీటి మూటలేనా!
- రోజుల తరబడి ఉంటున్నా పట్టించుకోని అధికారులు

నెల్లూరు(బారకాసు) : జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరం అనధికార ఫ్లెక్సీలకు నెలవుగా మారింది. ప్రధాన కూడళ్లతో పాటు ఆయా రోడ్ల పక్కన ప్రచార బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటికి కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే పని కానిస్తున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఓ వైపు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, మరోవైపు రూరల్ ఎమ్మెల్యే అనధికార ఫ్లెక్సీలను ఏర్పాటు చేయొద్దని.. అనుమతించిన ప్రదేశాల్లోనే ఫ్లెక్సీల ఏర్పాటు చేసుకోవాలని పలు మార్లు చెప్పినా వారి మాటలు పెడచెవిన పెడుతూ తమ ఇష్టారాజ్యంగా అనధికారికంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకుంటున్నారు.. అయినా కార్పొరేషన్‌లోని టౌన్‌ప్లానింగ్ విభాగ అధికారులు మాత్రం చర్యలు తీసుకోకపోగా మౌనం వహిస్తున్నారు.


మినీబైపాస్‌రోడ్డులో డివైడర్లపై అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

విచ్చలవిడిగా..

నగరపాలక సంస్థ పరిధిలో ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, రాజకీయ నాయకుల పుట్టినరోజు వేడుకలు, వర్ధంతులకు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు కట్టడం, స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడం పరిపాటి. వాటి ఏర్పాటు, తొలగింపుపై యంత్రాంగానికి విధానమంటూ లేకుండాపోయింది. నగర, మున్సిపాలిటీల్లో ఎవరైనా ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయాలంటే కచ్చితంగా అనుమతి ఉన్న ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి. అయితే ప్రధాన రహదారుల వెంట మొదలుకుని బహిరంగ ప్రదేశాలు, చిన్న చిన్న వీధుల్లో సైతం ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం స్థానిక మినీబైపాస్‌రోడ్డులోని డివైడర్లలో అనధికారంగా ఇబ్బడి ముబ్బడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఉన్నారు. అదేవిధంగా రామలింగాపురం ఫ్లైఓవర్ బ్రిడ్జికి, ఏసీనగర్ ప్రధాన రహదారిలో, అన్నమయ్య సర్కిల్ తదితర ప్రాంతాల్లో అనధికార ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి.

పోస్టర్ ఫ్రీ సిటీ గాలికి..

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నగరంలో పలు మార్లు పర్యటించినప్పుడు ఇబ్బడి ముబ్బడిగా ఉన్న ఫ్లెక్సీలను చూసి వెంటనే తొలగించాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మంత్రి మాటలు నీటి మూటలేనా అంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల మంత్రి నారాయణ నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద విచ్చలవిడిగా పోస్టర్లు అతికించి ఉంటే వాటిని తొలగించే ప్రక్రియ స్వయంగా చేపట్టారు. నెల్లూరు నగరాన్ని పోస్టర్ ఫ్రీ సిటీగా మార్చాలన్నదే తన లక్ష్యమని మంత్రి చెప్పారు. అయినా పరిస్థితుల్లో మార్పు రావడం లేదు.


రామలింగాపురం ఫ్లైఓవర్‌పై అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నగరంలో ఇదీ పరిస్థితి

నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులైన జీఎన్‌టీ రోడ్డు, మినీ బైపాస్‌రోడ్డులో ఉన్న డివైడర్లలో మొత్తం అధికారికంగా 600 వరకు లాలిపప్‌లు, అలాగే 15 హోర్డింగ్‌లు ఉన్నాయి. వీటిని 15 ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. వాటి నుంచి ఏడాదికి రూ.1.45 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో వీటి సంఖ్యను పెంచుకుంటే ఆదాయం పెరుగుతుంది. నగరంలో ప్రధాన ప్రాంతాలైన ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, ట్రంకురోడ్డు, గాంధీ బొమ్మ సెంటర్, వీఆర్సీ కూడలి, మద్రాసు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, కేవీఆర్ పెట్రోల్ బంకు సెంటర్, కరెంటాఫీస్ సెంటర్, వేదాయపాళెం, అయ్యప్పగుడి, అన్నమయ్య సర్కిల్, బీవీనగర్ సెంటర్, వనంతోపు సెంటర్, ముత్తుకూరు బస్టాండ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఈ ఫ్లెక్సీల వల్ల ప్రమాదాలతో పాటు శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని, అందువల్ల అనుమతి ఇవ్వకూడదని గతంలో అధికారులు నిర్ణయించారు. కొంత కాలంగా అధికార పార్టీ విషయంలో దీనిని పక్కన పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైనా మంత్రులు, ముఖ్య అతిధులు జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంలోనూ ఇలా నిమిత్తం ఫ్లెక్సీలు ఏర్పాటు జరుగుతోంది. నిబంధనలు అందరికీ ఒకేలా అమలు చేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. ఏదైనా కార్యక్రమం జరిగితే ఒకటి రెండు రోజులు అనుమతించి తొలగించాలని, రోజుల తరబడి ఉంచితే ఇబ్బందులు తప్పవని ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


ఎంవీఐ రఫీకి సన్మానం

నెల్లూరు (టౌన్) : ప్రతి వాహనదారుడు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎంవీఐ ఎండీ రఫీ తెలిపారు. స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో రహదారి భద్రతపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ ధరించి బైక్ నడపాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాన్ని నడపడం నేరమన్నారు. అనంతరం ఆయన్ను కళాశాల యాజమాన్యం సత్కరించింది. ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, మల్లికార్జునరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్, హెచ్‌ఓడీ సుబ్రహ్మణ్యం, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఫ్రాంచైజ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు రూరల్ : బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్ రీచార్జ్ వ్యాపారానికి ఫ్రాంచైజ్ షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామ్మోహన్ తెలిపారు. కోవూరు, అల్లూరు, కొడవలూరు, విడవలూరు మండల పరిధిలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈనెల 14వ తేదీలోపు నెల్లూరులోని జనరల్ మేనేజర్ కార్యాలయం మార్కెటింగ్ సెక్షన్‌లో దరఖాస్తులు దాఖలు చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 94400 00282 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

జేసీకి వినతి



నెల్లూరు(దర్గామిట్ట) : దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి గొటుకుల జాషువా అన్నారు. ఈ మేరకు వారు కలెక్టరేట్‌లో జేసీ కార్తీక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత క్రైస్తవులను షెడ్యూల్ కులాల్లో చేరిస్తే దళిత హిందూ సమాజంపై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. మతం మార్చుకున్న వారిని ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని కోరారు. బి.శ్రీనివాస్, గొల్ల కేశవులు, ఆర్.జనార్దన్, శివ, కోడూరి సత్యం పాల్గొన్నారు.

నేరాల కట్టడిపై విద్యార్థులతో సదస్సు


మాట్లాడుతున్న సీఐ

నెల్లూరు సిటీ : మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటి కట్టడిపై నగరంలోని లక్ష్మీపురంలో ఉన్న వివేకాంద కళాశాలలో నవాబుపేట సీఐ అన్వర్‌బాషా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్‌నేరాలు, మైక్రో ఫైనాన్స్ నేరాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాల గురించి అవగాహన కల్పించారు.

'నలంద'లో దంత వైద్యశిబిరం

నెల్లూరు (టౌన్) : స్థానిక బాలాజీనగర్‌లోని నలంద స్కూల్లో దంత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. హెల్త్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో పిల్లలు, తల్లిదండ్రులకు డాక్టర్ రాజరాజేశ్వరి దంత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు శ్యాంతన్, మాజీ కార్పొరేటర్ అంచూరు జానకి, శ్రీనివాసులునాయుడు, ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్కిల్ సెన్సెస్‌పై అవగాహన

నెల్లూరు సిటీ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్కిల్ సెన్సెస్ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పలు సూచనలు చేశారు.

కుట్టు మెషీన్ల పంపిణీ



నెల్లూరు(దర్గామిట్ట) : బీవీనగర్‌లోని జనహిత వాత్సల్య అనాథ శరణాలయానికి రూ.2 లక్షల విలువైన ఎనిమిది ఎల్రక్టానిక్ కుట్టు మెషీన్లను స్టేట్ బ్యాంక్ డిప్యూటీ జీఎం లేఖామీనన్ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎం శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ శేషగిరి, జనహిత వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరావు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తాం


లీకేజీలను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(పొగతోట) : జెడ్పీ కార్యాలయంలో బాబోయ్.. దుర్గంధం శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్, జెడ్పీ అధికారులు సంయుక్తంగా డ్రెయినేజీ, వాటర్ లీకేజీ ప్రాంతాలను పరిశీలించారు. శుక్రవారం నుంచి పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

పంచామృతాభిషేకం నేడు

నెల్లూరు(బృందావనం) : బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవార పంచామృతాభిషేక మహోత్సవం ఉదయం 9 గంటలకు జరుగనుందని నిర్వాహకుడు కర్తం ప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

సర్టిఫికెట్ల పరిశీలన నేడు

నెల్లూరు (టౌన్) : మున్సిపల్ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు శుక్రవారం సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు గురువారం తెలిపారు. దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమవుతుందన్నారు.

నేటి నుంచి కార్తీకమాస లక్ష దీపోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని వీఆర్సీ మైదానంలో కార్తీకమాస లక్ష దీపోత్సవాన్ని వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. దీపోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను గురువారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. విశాఖపట్నంలోని సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానందభారతి ఆశీస్సులతో ప్రముఖ ప్రవచకుడు చాగంటి కోటేశ్వరరావు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవానికి శ్రీకారం చుట్టనున్నామన్నారు. విశేష పూజా కార్యక్రమాలను ఆదివారం వరకు నిర్వహించనున్నామని, జిల్లా వాసులు తరలిరావాలని కోరారు.


తరలిరండి

నగరంలోని వీఆర్సీ మైదానంలో శుక్రవారం వైభవంగా నిర్వహించనున్న కార్తీకమాస లక్ష దీపోత్సవానికి ప్రజలు తరలిరావాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు. ఈ ఏర్పాట్లను గురువారం రాత్రి వారు పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. నిర్వాహకులు కంచర్ల భాస్కర్ శర్మ, ఆమంచర్ల వెంకటప్రభాకర్‌రావు ఉన్నారు.






ఏర్పాట్లను పరిశీలిస్తున్న వేమిరెడ్డి దంపతులు



పురాతన భవనంలో అగ్నిప్రమాదం

నెల్లూరు(అర్బన్) : స్థానిక సంతపేటలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం పాత భవనంలోని వరండా ప్రాంతంలో గురువారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వందేళ్ల క్రితం జిల్లా వైద్యశాఖ కార్యాలయంగా నిర్మించిన ఆ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో మూసేశారు. ఈ భవన ఆవరణలో పెద్ద ఎత్తున చెత్త, దోమల నివారణకు కాలువల్లో వేసేందుకు ఆయిల్‌తో కూడిన డ్రమ్ములున్నాయి. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో అక్కడ గంజాయి, మద్యం బ్యాచ్ ఎప్పుడూ సేద తీరుతుంటోంది. ఈ నేపథ్యంలో కావాలని చేశారో.. ఆకతాయిల పనో తెలియదు కానీ ఉదయం 10.20 గంటల ప్రాంతంలో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య అగ్నిమాపక అధికారులకు ఫోన్ చేశారు. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పాయి. అయితే అప్పటికే ఆవరణలోని టేకుకు నిప్పంటుకుని పలు ఖరీదైన బర్మా టేకు దుంగలు కాలిపోయాయి. విలువైన ఫైళ్లు, ఖరీదైన వస్తువులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.


కాలుతున్న జిల్లా వైద్యశాఖ పూర్వ కార్యాలయం

విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి

నెల్లూరు (టౌన్) : ధనలక్ష్మీపురంలోని వీబీఆర్ స్కూల్లో పదో తరగతి విద్యార్థి ప్రనత్ మృతిపై విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల ఐక్య వేదిక (ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం, ఎస్ఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఏడీ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. స్కూల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్‌షరీఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీహర్ష, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు శేషుగౌడ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్, ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య, ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరీముల్లా పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు

రుణాలపై అవగాహన కల్పించండి

- అదనపు కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు) : స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు పొందే వివరాలపై అవగాహన కల్పించి అర్హులైన బృందాలకు రుణాలు మంజూరు చేయించాలని ఎన్‌ఎంసీ అదనపు కమిషనర్ నందన్ మెప్మా సభ్యులకు సూచించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ (సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్) నిర్వహణపై నగరపాలక కార్యాలయంలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయక బృందాలకు రుణాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌ను ప్రతిఒక్కరూ ఇన్‌స్టాల్ చేసుకుని సభ్యుల వివరాలను అందులో నమోదు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలన కోసం రూపొందించి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలపై విస్తృతమైన ప్రచారం కల్పించి అర్హులందరికీ రుణాలు అందేలా తోడ్పడాలని ఆయన సూచించారు. సమావేశంలో మెప్మా పీడీ రవీంద్ర, నగరపాలక సంస్థ టీపీఆర్‌ఓ బాలకృష్ణ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కమిషనర్ నందన్

ఎస్‌ఏలకు పదోన్నతి

నెల్లూరు (టౌన్) : మున్సిపల్ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో సీనియారిటీ ప్రతిపాదికన నలుగురు స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెడ్ మాస్టర్లుగా పదోన్నతి లభించింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ ఆర్.బాలాజీరావు ఆధ్వర్యంలో గురువారం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సీనియారిటీ ప్రాతిపాదికన వారికి ఆయా పాఠశాలల్లో పోస్టింగ్ ఇచ్చారు.

వ్యవసాయాధికారులకు శిక్షణ

నెల్లూరు(సెంట్రల్) : సాగులో కొత్త పద్ధతులపై రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని డీఏఓ సత్యవాణి అన్నారు. నెల్లూరులోని తన కార్యాలయంలో నేషనల్ పెస్ట్ సర్వేలెన్స్ యాప్‌పై వ్యవసాయాధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా వచ్చిన యాప్‌లో పంటల వివరాలు, పంటలకు వచ్చే తెగుళ్ల వివరాలను నమోదు చేయాలని సూచించారు.

పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు సిటీ : నగరంలోని డైకస్‌రోడ్డులో సింహపురి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో 'డొనేట్ హెయిర్ ఫర్ కేన్సర్ పేషెంట్స్' అవగాహన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ డాక్టర్ సత్తార్, కేవీఎస్ పెయింట్స్ డైరెక్టర్ ధనేష్‌నాయుడు, సింహపురి సోషల్ సర్వీస్ ఫౌండర్ నయమతుల్లా, సెక్రెటరీ ఆరిఫ్, సభ్యులు పఠాన్ దస్తగిరి, జుబేర్ పాల్గొన్నారు.

అనుసంధానం చేసుకోవాలి

నెల్లూరు రూరల్ : సంక్షేమ పథకాలకు సంబంధించి ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకుతో అనుసంధానం కావాలని పోస్టాఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు అన్నారు. తన కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మూడు లక్షల ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాలేదని, ఇండియన్ పేమెంట్ బ్యాంక్ ఖాతాలు తెరిచేందుకు దగ్గరలోని సచివాలయానికి వెళ్లాలని కోరారు.

గుప్తనిధులపై ప్రచారం

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని నరసింహకొండకు సమీపంలో కొమరిపూడి గ్రామంలో గత కొన్ని రోజులుగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం గ్రావెల్ తవ్వకాల్లో గుప్తనిధులు దొరకాయనే ప్రచారం సాగుతోంది.

పటిష్టంగా పారిశుద్ధ్య పనులు

నెల్లూరు(బారకాసు) : నగర వ్యాప్తంగా అవసరమైన అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పటిష్టంగా నిర్వహిస్తున్నామని నగరపాలక కమిషనర్ సూర్యతేజ అన్నారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. బ్రిడ్జి సమీపంలోని డ్రెయిన్ కాలువ లీకేజీ ద్వారా అండర్ బ్రిడ్జి ప్రాంతం మురుగు నీటితో నిండిపోయి పాదచారులు, వాహన చోదకులకు ఇబ్బందిగా మారిన పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. వెంటనే స్పందించిన కమిషనర్ భూగర్భ డ్రెయినేజీ యంత్రాల సహాయంతో అండర్‌బ్రిడ్జి ప్రాంతంలోని మురుగునీటి మొత్తాన్ని తోడించేశారు.


అండర్‌బ్రిడ్జి ప్రాంతంలో మురుగు నీటి తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్

కేన్సర్‌కు 'మెడికవర్'లో అధునాతన వైద్యం

నెల్లూరు (అర్బన్) : నెల్లూరులోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అన్ని రకాల కేన్సర్‌లకు అత్యాధునిక వైద్యసేవలందిస్తున్నామని ఆస్పత్రి సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ రమేష్‌బాబు తెలిపారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ ఆస్పత్రిలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేన్సర్ ఆపరేషన్లు, రేడియేషన్, కీమో సేవలతో పాటు 5 నిముషాల్లో కేన్సర్‌ను గుర్తించే పెట్ స్కాన్ లాంటి సేవలను మహా నగరాల్లోని ఆస్పత్రులకు దీటుగా అందిస్తున్నామన్నారు. కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ హెడ్ బిందురెడ్డి మాట్లాడుతూ.. కేన్సర్‌పై అవగాహన కలిగించేందుకు ప్రతి మంగళవారం ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామన్నారు. రూ.2800 విలువ చేసే మేమోగ్రామ్ పరీక్షతో పాటు ఆర్‌బీఎస్, పాప్‌స్మియర్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఎక్స్‌రే, ఓరల్ కావిటీ చెకప్‌లు ఉచితంగా చేస్తామన్నారు. కన్సల్టెంట్ ఆంకాలజిస్ట్ అవినాష్, రేడియాలజీ ఆంకాలజిస్ట్ హరికాంత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్లు రమేష్‌బాబు, బిందురెడ్డి

విద్యార్థులకు కౌన్సెలింగ్

నెల్లూరు(అర్బన్) : జిల్లాలోని నర్సింగ్ కళాశాలల్లో కోర్సు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. విద్యార్థినుల సర్టిఫికెట్లను పరిశీలించి సీట్లు కేటాయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ 23 కళాశాలలకు సంబంధించి 500 సీట్లను భర్తీ చేశామన్నారు. ఖాళీలు ఉంటే ఈనెల 20వ తేదీ చివరిసారిగా భర్తీ చేస్తామన్నారు.

బెల్టు దుకాణంపై దాడి

నెల్లూరు సిటీ : బుజబుజ నెల్లూరులోని న్యూ కాలనీకి చెందిన సంపూర్ణమ్మ తన నివాసంలో బెల్టు దుకాణం నిర్వహిస్తుండగా వేదాయపాళెం పోలీసులు గురువారం దాడులు చేశారు. ఆమె వద్ద నుంచి 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.